క్లుప్తంగా

అమ్మవారికి లక్ష కుంకుమార్చన


సుశీలాంబదేవికి లక్ష కుంకుమార్చన

ఎమ్మిగనూరు: పట్టణంలోని ఆదోని బైపాస్ రోడ్డులో గల శ్రీ సుశీలాంబదేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. వేదపండితులు, పుర ప్రముఖుల సమక్షంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు విశేషంగా పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం 1 గంట నుంచి ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అనాథ విద్యార్థులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: స్థానిక ఫాతిమా ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 16 మంది అనాథ విద్యార్థుల ఆలనాపాలనా కోసం ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు క్రీడాపోటీలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరూ లేని అనాథ పిల్లలను చేరదీసి చదివించడం గొప్ప విషయమన్నారు. వారికి ఎలాంటి సహాయం కావాలన్నా తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. పాఠశాల సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావ్

వెల్దుర్తి: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాసరావ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలన సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల గురించి వాస్తవాలు, గణాంకాలతో తెలిపారు. పేదరికం, చదువు లేకపోవడం, ఆడపిల్లల పట్ల చిన్నచూపు, ఆర్థిక భారంగా భావించడం, సాంఘిక ఆచారాలు, సాంప్రదాయాలు బాల్య వివాహాలు జరపడానికి గల కారణాలన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు చొరవ చూపి బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. చట్టాల గురించి వివరిస్తూ, బాల్య వివాహం చేస్తే శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యాక్, ఈఓఆర్డీ నరసింహులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి సద్వినియోగం చేసుకోండి


మద్దికెరలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర: పంటల సంరక్షణకు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు బోజరాజు, జాకీర్, ఆనంద్ సూచించారు. శుక్రవారం మద్దికెరలో రైతు పరశురాంకు చెందిన సజ్జ పొలంలో ఏఓ రవి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతు స్థాయిలో ట్రీ పేపర్, క్లోత్ విత్తనాల మొలక శాతం పరీక్షలు చేశారు. పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. వీఏఏ రాణి, రైతులు పాల్గొన్నారు.

సొమ్ము రికవరీ చేయాలి


మాట్లాడుతున్న అధికారి శిద్ధలింగమూర్తి

తుగ్గలి: ఉపాధి హామీ పథకంలో దుర్వినియోగమైన సొమ్మును వెంటనే రికవరీ చేయాలని డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి శిద్ధలింగమూర్తి ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఉపాధి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఉపాధి పనులపై 17 రౌండ్లు సోషల్ ఆడిట్ చేసినట్లు తెలిపారు. దుర్వినియోగమైనట్లు సోషల్ ఆడిట్‌లో తేల్చిన సొమ్ము రికవరీలో నిర్లక్ష్యం తగదన్నారు. వెంటనే బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయాలన్నారు. అంబుడ్స్ పర్సన్ చంద్రశేఖర్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఆదినారాయణ, ఏపీడీ పద్మావతి, ఏపీఓ రామకృష్ణ, ఈసీ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు అండగా ప్రభుత్వం



పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ కింద మంజూరైన రూ.3.63 కోట్ల చెక్కును అందజేస్తున్న ఎర్రకోట జగన్, హాజరైన పొదుపు సంఘాల సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: స్వయం సహాయక సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ సున్నా వడ్డీ కింద పొదుపు సంఘాల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు మండలంలో 1,366 పొదుపు గ్రూపులకు రూ.1.39 కోట్లు, గోనెగండ్ల మండలంలో 1,327 గ్రూపులకు రూ.1.07 కోట్లు, నందవరం మండలంలో 1,328 గ్రూపులకు రూ. 1.16 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు పొదుపు సంఘాలను నిర్వీర్యం చేశాడన్నారు. పొదుపు సంఘాలకు రుణమాఫీ చేస్తానని చెప్పి నట్టేట ముంచారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న పొదుపు మహిళలకు సున్నా వడ్డీ వర్తింపజేశారని కొనియాడారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణాధ్యక్షులు బుట్టారంగయ్య, ముగతి విరుపాక్షిరెడ్డి, తిరుమలరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ దశరథరాముడు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

తుగ్గలి: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంభనే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ క్రాంతి పథం సీసీ ఆంజనేయులు అన్నారు. డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ రాయితీని శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి పొదుపు మహిళల ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవనంలో టీవీ ద్వారా సీఎం కార్యక్రమాన్ని పొదుపు మహిళలు వీక్షించారు. మండలంలో మొత్తం 1,131 సంఘాల్లోని 12,356 మంది సభ్యులకు రూ.1.23 కోట్లు సున్నా వడ్డీ కింద మంజూరైందన్నారు. అకౌంటెంట్ త్రివేణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు చంద్రమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఆస్పరి: వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడత కింద సాయం మంజూరు చేయడంతో ఆస్పరిలో పొదుపు మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మండలంలో 1,041 పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ కింద రూ.88.67 లక్షలు మంజూరైందని ఏపీఎం రాఘవేంద్ర తెలిపారు. అంతకుముందు స్త్రీ శక్తి భవనంలో సీఎం లైవ్ ప్రోగ్రాంను ఏర్పాటు చేశారు. పొదుపు మహిళలు, సిబ్బంది సుధాకర్, మస్తాన్ పాల్గొన్నారు.


ఆస్పరిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు

ముగిసిన వేలం పాట

ఆస్పరి: మండలంలోని కైరుప్పల కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కుల వేలం రూ.4.36 లక్షలు పలికింది. శుక్రవారం స్థానిక ఆంజినేయ స్వామి ఆలయ ఆవరణలో సర్పంచ్ తిమ్మక్క ఆధ్వర్యంలో 2023–2024 సంవత్సరానికి కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కుల వేలం పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి నిర్వహించారు. వేలంలో రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి 10 మంది పాటదారులు పాల్గొన్నారు. చివరకు బోయ గోపాల్ అనే వ్యక్తి రూ.4.36 లక్షలకు హెచ్చు పాడి హక్కులు సొంతం చేసుకున్నారు. గ్రామ పెద్దలు వీరభద్రి, శ్రీనివాసులు, విరుపాక్షి, వీరేష్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన 12 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. గురువారం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని అడ్డుకోవడంతో పాటు పోలీసులపైకి దాడికి యత్నించి గ్రామంలో అలజడి సృష్టించిన టీడీపీ కార్యకర్తలు సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లాల్‌పీర, శ్రీరాములు, కాశన్న, మండకల్, శ్రీనివాసులునాయుడు, ఉపేంద్ర, వెంకటనాయుడు, గోవిందు, రమేష్, జిలేబిబాషాపై 353, 341, 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకోవడం సిగ్గుచేటు


పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

పత్తికొండ రూరల్: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పుచ్చకాయలమాడ గ్రామంలో గురువారం సాయంత్రం పర్యటిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని కొందరు టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, బాబుల్‌రెడ్డి, కారంనాగరాజు, మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాస్ అధ్యక్షతన వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పర్యటనలో గ్రామస్తులు ఎంతో ఆదరణ చూపించారన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీకి ప్రజా మద్దతు పెరిగితే తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందనే అభద్రతా భావంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకునే స్థాయికి దిగజారారన్నారు. పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్యేపై, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కర్రలు, రాళ్లతో దాడికి పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో పోటీ పడాలే గానీ, ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకోవడం, అల్లరి మూకలతో దాడికి యత్నించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, బళ్లారి మోహన్‌కృష్ణ, టీఎండీ హుసేన్, బనగాని శ్రీనివాసులు, లలితరామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ముసాయిదా జాబితా ప్రచురణ


బుక్కాపురం సచివాలయంలో రీసర్వే జాబితాను ప్రచురిస్తున్న రెవెన్యూ, సర్వే అధికారులు

వెల్దుర్తి: బుక్కాపురం రెవెన్యూ పరిధిలో నిర్వహించిన వైఎస్సార్ జగనన్న సమగ్ర భూసర్వే ముసాయిదా జాబితాను రీసర్వే టీడీ దీపిక, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి శుక్రవారం ప్రచురించారు. ముసాయిదా వివరాలను గ్రామ పెద్దల సమక్షంలో గ్రామసభలో విశదీకరించారు. అధికారులు మాట్లాడుతూ.. బుక్కాపురం పరిధిలో 5,235.78 ఎకరాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. ఈ మేరకు వివరాలను సచివాలయంలో ప్రచురించినట్లు చెప్పారు. రీసర్వే ప్రకారం తమ భూములు ఎక్కువ, తక్కువ, ఇంకేమైనా సమస్యలు ఉంటే తమ అభ్యంతరాలను వారం రోజుల్లోగా తెలపాలని కోరారు. గత శనివారం పుల్లగుమ్మి పరిధిలో చేపట్టిన రీసర్వే ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం వచ్చిన అర్జీలపై అనుమానాల నివృత్తి జరుగుతోందన్నారు. వీఆర్‌ఓ ఎల్లకృష్ణ, సర్వేయర్లు శోభారాణి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ


మాట్లాడుతున్న డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి రమణ

ఆలూరు: పంటల కోత ప్రయోగాన్ని ఎంఈఓలు పక్కాగా నిర్వహించాలని జిల్లా డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి రమణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏడీఏ సునీత సమక్షంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏ సర్వే నంబర్లలో ఏ రకం పంటలను రైతులు సాగు చేశారనే వివరాలను ప్రభుత్వం సూచించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా ఎంపిక చేసుకుని ప్రయోగాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పంటకోత ప్రయోగం ద్వారా దిగుబడులు అంచనా వేయవచ్చని, ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావారణం ఆధారిత బీమా, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కీలకం అవుతుందన్నారు. ఏఈఓ వెంకటేష్‌గౌడు, ఏఎస్‌ఓలు ఈశ్వర్, రామాంజనేయులు, పావని పాల్గొన్నారు.

అమర వీరుల సేవలను మరువరాదు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఎమ్మిగనూరుటౌన్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులను మరువరాదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. 'నా భూమి – నాదేశం', ఆజాదీకా అమృత్ మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పెద్దపార్క్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రమిదల్లో మట్టిని సేకరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలు, వలంటీర్లతో పార్క్ నుంచి ఆర్ అండ్‌బీ అతిథి గృహం వరకు ర్యాలీ చేశారు. అక్కడ మొక్కలు నాటారు. దేశ రక్షణ ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, నాయకులు షబ్బీర్‌అహమ్మద్, బుట్టారంగయ్య, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

కృష్ణగిరి: డివిజన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు రైతులకు సకాలంలో అందిస్తున్నామని డోన్ ట్రాన్స్‌కో ఏడీఈ రమణారావు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణగిరి మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 7వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వచ్చిన 894 దరఖాస్తులకు గాను 543 మంది కనెక్షన్లకు సంబంధించి డీడీలు కూడా కట్టడం జరిగిందన్నా రు. ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నా రు. జూలై నెలలో 400 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీరికి కూడా సకాలంలో విద్యుత్ కనెక్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

నామినేషన్ల పరిశీలన

హొళగుంద: మండలంలో సుళువాయి 7వ వార్డు స్థానానికి 4, చిన్నహ్యాట 9వ వార్డుకు 2, మద్దిలింగదహళ్లి 3వ వార్డుకు 4 నామినేషన్లు దాఖలైన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో సుళువాయి 7వ వార్డుకు దాఖలైన వాటిలో 3 తిరస్కరణకు గురయ్యాయి. బోయ వరలక్ష్మి నామినేషన్ మాత్రమే బరిలో ఉన్నట్లు జిల్లా సహాయక ఎలక్షన్ అథారిటీ (ఏడీఈఏ), ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ విలేకరులకు తెలిపారు. మిగతా నామినేషన్లు ఆమోదించినట్లు చెప్పారు. నేడు అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేది, అభ్యర్థుల ప్రకటన, 19న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని ఆమె చెప్పారు.

జల్‌జీవన్ పథకం నిధులు మంజూరు

ఆలూరు: తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న 20 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య తెలిపారు. హాలహర్వి మండలం బాపురం, చింతకుంట తదితర గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులలో ఎల్లెల్సీ ద్వారా రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తున్న నీటిని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ ఆయా గ్రామాలలో జలజీవన్‌మిషన్ పథకం కింద తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాలకు మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు. ఈ నిధులతో పనులు శరవేగంగా చేపట్టినట్లు వెల్లడించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష 20–1–2024న ఉంటుందని వెల్లడించారు.

గడ్డివామి దగ్ధం

హాలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామంలో రామన్నగౌడ్ అనే రైతుకు చెందిన గడ్డివాముకు శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. వెంటనే ఆలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.80 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు రామన్నగౌడ్ వాపోయారు. పక్కనున్న గడ్డివాములకు మంటలు విస్తరించకుండా అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

ఆస్పరి: ప్రభుత్వం గ్రామాలలోని ఆర్‌బీకేలలో ఎరువులు అందుబాటులో ఉంచిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆస్పరి ఆర్‌బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పంటల నమోదు పక్కాగా చేపట్టాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఏఓ నరేంద్ర కుమార్, సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, నాయకులు సుంకర రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

చిప్పగిరి: స్థానిక జూనియర్ కళాశాలలో గణితం బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. ఎమ్మెస్సీ గణితంలో 50% మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి గల వారు ఈ నెల 17న కళాశాలలో నిర్వహించే ఇటర్వ్యూకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

గోనెగండ్ల: ప్రతి రైతు వ్యవసాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి అన్నారు. శుక్రవారం మండలంలోని హెచ్.కై రవాడి ఆర్బీకేలో ఏఓ హేమలత ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అనంతరం రైతులకు ఎరువులు, రైతు భరోసా మాస పత్రికలను అందజేశారు. అలాగే హెచ్.కై రవాడి గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉద్యాన అధికారిణి శ్రీవాణి, వీహెచ్‌ఏ స్వామి, వీఏఏ లక్ష్మన్న, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


మృతిచెందిన మదగన్న

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో ఉపాధి పనులు చేస్తుండగా కందారి మదగన్న (49) గుండెపోటుకు గురై మృతిచెందాడు. తోటి కూలీలు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య రాములమ్మ, కుమారుడు మహేష్, కుమార్తె ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న మదగన్న మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ నెట్టికంఠమ్మ, భర్త పరశురాం, ఏపీఓ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లప్ప పరామర్శించారు. సర్పంచ్ సద్దాంహుసేన్ వైఎస్సార్‌బీమా కింద మంజూరైన రూ.10 వేలను నామినీ రాములమ్మకు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వెల్దుర్తి: రామళ్లకోట గ్రామ పరిసరాల్లో శుక్రవారం తెల్లవారుజామున పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మద్దయ్య, తారకేశ్వర్, వెంకటేశ్వర్లు, యోగేశ్వర్‌నాయుడు, బాలరాముడు, శేఖర్‌ను అదుపులోకి తీసుకుని రూ.8,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

- ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలి


పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ మోహన్‌దాస్

మద్దికెర: గ్రామాలలో పోలింగ్ బూత్ ఆఫీసర్లు ఓటరు వెరిఫికేషన్ సర్వే పక్కాగా నిర్వహించాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాలలో పోలింగ్ బూత్‌లు, ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ నాగభూషణం, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్‌ఓలు బాలవర్ధిరాజు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

తుగ్గలి: ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా చేపట్టాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ ఆదేశించారు. ఓటర్ల సవరణపై బూత్‌లెవెల్ అధికారులతో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు, బదిలీ, తొలగింపుపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఈనెల 21లోపు సవరణ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. సవరణలో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తుగ్గలిలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. తహసీల్దార్ రవి, డీటీ నిజాముద్దీన్, ఆర్‌ఐ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: ఓటరు వెరిఫికేషన్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. అలాగే పెళ్లై వెళ్లిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించి తగిన ఆధారాలతో ఓటు హక్కు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన వారికి ఫారం–6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు.

పంట నమోదు తప్పనిసరి


పత్తికొండలో అగ్రి ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జేడీఏ పీఎల్ వరలక్ష్మి

పత్తికొండ రూరల్: రైతులు సాగు చేసిన ప్రతి పంటను పక్కాగా ఈ–క్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ సమీపంలో చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈమె మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలను పండించే రైతులకు సరైన మద్దతు ధర దొరక్క, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలు దెబ్బతిని నష్టపోవడాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ–క్రాప్ ద్వారా ప్రయోజనం చేకూర్చుతోందన్నారు. ఈ పంట నమోదు కాకపోతే వ్యవసాయ పథకాలు వర్తించవన్నారు. అలాగే పంటలను నాశనం చేసే చీడపీడలు, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అగ్రిల్యాబ్‌లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణను పర్యవేక్షించారు. ఏడీఏ విజయమోహన్‌కుమార్, డీఏఓ టెక్నికల్ ఏఓ శారదమ్మ, ఏఓ వెంకటరాముడు, అగ్రిల్యాబ్ ఏఓ మునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన డీఏఓ

దేవనకొండ: మండలంలో సాగుచేసిన పత్తి, వేరుశనగ, ఆముదం తదితర పంటలను శుక్రవారం డీఏఓ వరలక్ష్మి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఆర్‌బీకే సిబ్బంది ద్వారా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. క్రిస్టల్ కంపెనీ సీసీహెచ్–369 రకం విత్తనంతో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించి, తెగుళ్ల నివారణ, రసం పీల్చే పురుగులను ఎలా నివారించుకోవాలని సూచించారు. ఏఓలు సురేష్‌బాబు, శారద, ఏఈఓ యోగి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సుంకుర ఉమాదేవి

ఆస్పరి: మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని తంగరడోణ, హలిగేర, యాటకల్లు, బిల్లేకల్లు, బిణిగేరి గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు నరసన్న, రహంతుల్లా, లక్ష్మి, శ్రీను, వెంకటేష్ ఆదోని ఆర్‌టీసీ డిపో అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకుర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయా గ్రామాల నుంచి మోడల్ స్కూల్, హైస్కూళ్లకు వెళ్లేందుకు విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఆటోలలో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మండలంలో మంచి నీరు, రోడ్ల సమస్యను పరిష్కరించాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రెవెన్యూ, విద్య, వైద్యం, అంగన్‌వాడీ, వ్యవసాయం తదితర శాఖల అధికారులు తమ శాఖల పనితీరు గురించి వివరించారు. ఎంపీడీఓ రాణెమ్మ, డీటీ గాయత్రి, ఏఓ నరేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

చిప్పగిరి: మండలంలో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఉలిగన్న తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సేవలకు సంబంధించి మరమ్మతు పనులు చేస్తున్న కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండా కొండల్లో శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడుల చేశారు. కొండల్లో నాటుసారా స్థావరాలను గుర్తించి అక్కడ సారా తయారీ కోసం 40 బిందెల్లో నిల్వ ఉంచిన దాదాపు 600 లీటర్ల బెల్లం ఊటను, ముడి సరుకులతో పాటు ప్లాస్టిక్ బిందెలను ధ్వంసం చేశారు. అదేవిధంగా గ్రామంలోని ఓ సారా విక్రేత నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రక్తహీనత నివారించాలి

ఆలూరు రూరల్: గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం రాకుండా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు సూచనలు, సలహాలు ఇవ్వాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సచివాలయం–1 పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్‌లో ఏఎన్‌ఎంలు, ఆశాలతో సమావేశం అయ్యారు. ముఖ్యంగా చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారణకు శ్రద్ధ తీసుకోలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు ఆహారంలో పాలు, పండ్లు, ఆకు కూరలు తీసుకునేలా ప్రోత్సహించాలని, ప్రతి నెలా ఏఎన్‌ఎంలు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలని సూచించారు.